ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 21: అకాల వర్షాలకు ధాన్యం తడిసిందని రైతులు అధైర్యపడవద్దని, ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఆదివారం యాసంగి ధాన్యం కొనుగోళ్ల పై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 418 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, ఇప్పటి వరకు 2,365 మంది రైతుల నుంచి 11,305 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. అన్ని కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, అకాల వర్షాల దృష్ట్యా ఇంకా అవసరమైన చోట్ల టార్పాలిన్ కవర్లు సమకూర్చాలని మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఎటువంటి జాప్యం లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలన్నారు. రైస్‌మిల్లుల వద్ద ధాన్యం దిగుమతిలో ఎటువంటి జాప్యం లేకుండా జరపాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, రైస్ మిల్లర్లు ఎటువంటి ధాన్యం కోతలు పెట్టరాదని ఆదేశించారు. రైతులు దళారుల వద్ద మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఎం సివిల్ సప్లై హరీశ్, డీసీఎస్‌వో తనూజ, డీఆర్డీవో జయదేవ్, పీడీ మెప్మా హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

వివాహాలకు హాజరైన హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 21: సిద్దిపేట పట్టణంలో ఆదివారం పలు వివాహాలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు. పట్టణంలోని రెడ్డి సంఘం, పోలీస్ కన్వెన్షన్ హాల్, కొండమల్లయ్య గార్డెన్, చంద్రమౌళి గార్డెన్, నిమ్రా గార్డెన్, నందాల వెంకటలక్ష్మీగార్డెన్, సీసీ గార్డెన్‌లో జరిగిన వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ మల్యాల గ్రామ అధ్యక్షుడి మనుమడి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. ఆయన వెంట దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



చేర్యాలలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రజలకు అండగా ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, ఏప్రిల్ 21: మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన ఆలేటి జయవిష్ణు కుమార్తె మనిషా వివాహం చేర్యాల మండలంలోని ఆకునూరు చెందిన ప్రశాంత్‌తో ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరగడంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం పట్టణంలో నూతనంగా ప్రారంభించిన భద్రఖాళీ షాపింగ్ జోన్‌ను ఎమ్మెల్యే సందర్శించి యాజమాన్యాన్ని అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు షాపింగ్ జోన్ యాజమాన్యం జ్ఞాపిక అందజేసి సన్మానించింది.అనంతరం పట్టణానికి చెందిన పుర్మ వాసుదేవరెడ్డి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పల్లా పరామర్శించి సంతాపం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్, బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మందయాదగిరి, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, నాయకులు వకులాభరణం నర్సయ్యపంతులు, బుడిగె గురువయ్యగౌడ్, నారాయణగౌడ్,రాచకొండ శ్రీనివాస్, కాసర్ల కనకరాజు పాల్గొన్నారు.

చౌదర్‌పల్లిలో బొడ్రాయి ఉత్సవాలు

చౌదర్‌పల్లిలో బొడ్రాయి పూజలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, ఏప్రిల్ 21: మండలంలోని చౌదర్‌పల్లిలో ఆదివారం పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, బొడ్రాయి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బొడ్రాయి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పడిగెరాజు, శ్రీనివాస్‌గుప్తా, యాదగిరిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థికి మద్దతుగా తనయుడి ప్రచారం

బేగంపేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ తనయుడు ప్రణయ్

బెజ్జంకి, ఏప్రిల్ 21: కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆయన తనయుడు ప్రణయ్ మండలంలోని బేగంపేటలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో తన తండ్రి, ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, శ్రీనివాస్‌గుప్తా, రాజయ్య, సంజీవరెడ్డి, శేఖర్‌బాబు, శంకర్, కార్యకర్తలు ఉన్నారు.

పల్లెల వాకిట 'పండుగ' సందడి

బైరాన్‌పల్లిలో ముస్తాబవుతున్న దుర్గమ్మ ఆలయం

- గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు
- అంబరాన్నంటనున్న పండుగ సంబురాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 21: మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని వివిధ గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. పలు గ్రామాల్లో గ్రామ దేవతలు, కుల దేవతల ప్రతిష్ఠాపన ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. సుమారు నెల రోజుల పాటు గ్రామాల్లో పండుగ సంబురాలు అంబరాన్నంటనున్నాయి. ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో సోమవారం నుంచి ఈ నెల 26వరకు దుర్గామాత ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగనున్నాయి. సోమవారం సాయంత్రం బైరాన్‌పల్లి పోచమ్మకు బోనాలు, 23న బెక్కంటి పోచమ్మకు బోనాలు, 23న గడిమైసమ్మ, బొడ్రాయికి సామూహిక బోనాలు, 24న ఉదయం దుర్గాభవానీమాత విగ్రహ ప్రతిష్ఠాపన, సాయంత్రం 6గంటలకు కుల దేవతలకు బోనాలు, 25న ఒడి బియ్యం, 25న దుర్గమ్మకు బోనాలు సమర్పించడంతో ఉత్సవాలు ముగియనున్నాయి. లద్నూర్‌లో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నారు. 24న పోచమ్మకు బోనాలు, 26న సాయంత్రం బొడ్రాయికి బోనాలు, 27న దుర్గమ్మ పండుగ, సాయంత్రం దుర్గమ్మకు బోనాలు సమర్పిస్తారు. లద్నూర్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి మే 2వ తేదీ వరకు బీరప్ప(పెద్ద)పండుగ నిర్వహించనున్నారు. రేబర్తిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మే 28 నుంచి రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి

రాఘవాపూర్‌లో ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 21: మెదక్‌లో మరోసారి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాఘవాపూర్‌లో ముఖ్య నాయకులతో ఆయన సమావేశమై పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యహంపై చర్చించారు. సిద్దిపేట రూరల్ మండలంలో బీఆర్ఎస్‌కు పట్టు ఉన్నదని, దాన్ని అలాగే కొనసాగించి మాజీ మంత్రి హరీశ్‌రావుకు పేరు తీసుకురావాలని నాయకులను కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మరోసారి రైతులు, మహిళలు, నిరుద్యోగులను మోస చేసేందుకు కపట ప్రేమ చూపుతోందని, దీన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రావు, రామచందర్‌రావు, గ్యార తిరుపతి, సురేశ్, రాజు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

గజ్వేల్, ఏప్రిల్ 21: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని సీఐ సైదా అన్నారు. గజ్వేల్ పట్టణంలోని నియోజకవర్గ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ సమ్మర్ క్యాంపును ఆదివారం ఆయన ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ యువ క్రీడాకారులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు సీఐ ముత్యం రాజు, బాలల సంక్షేమ సమితి జిల్లా సభ్యుడు నర్సింహులు, క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు హరిచంద్రప్రసాద్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెదక్‌లో బీఆర్ఎస్‌దే విజయం



బీఆర్ఎస్ బూత్ కమిటీల సమావేశంలో నినాదాలు చేస్తున్న నేతలు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఘన విజయం ఖాయమని సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు అన్నారు. మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచనల మేరకు ఆదివారం మెదక్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి 30, 31, 32, 33, 43 వార్డుల బూత్ కమిటీల సమావేశం జరిగింది. సమావేశంలో కౌన్సిలర్లు వజీరొద్దీన్, మొయిజ్, ఎల్లం యాదవ్, రాజు,బీఆర్ఎస్ బీసీ సెల్ కోఆర్డినేటర్ ముదిగొండ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం

సయ్యద్ రహీముద్దీన్‌ను సన్మానిస్తున్న ఇందుప్రియాల్ బీఆర్ఎస్ కార్యకర్తలు

రాయపోల్, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన సయ్యద్ రహీముద్దీన్‌ను అదివారం ఇందుప్రియాల్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రహీముద్దీన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయమన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో దౌల్తాబాద్ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశం, సీనియర్ మండల నాయకులు దారా సత్యనారాయణ, పోతరాజు స్వామి, మధుసూదన్‌రెడ్డి, బైండ్ల యదగిరి,మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షాదుల్లా,బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్,కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరిపై కేసు

ఘటనా స్థలంలో వడ్ల కుప్పలను పరిశీలిస్తున్న సిద్దిపేట రూరల్ పోలీసులు

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 21: నిర్లక్ష్యంగా రోడ్డుపై వడ్లు పోసి వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను మాట్లాడుతూ దుబాసి భాను అప్పనపల్లి నుంచి తిమ్మాపూర్‌కు బైక్‌పై వస్తున్నాడు.తోర్నాల శివారులోని చింతచిన్నకుంట వద్ద తోర్నాల గ్రామస్తులు వాసూరి యాదయ్య, వాసూరి తిరుపతి రోడ్డుపై వడ్లుపోసి టార్పాలిన్ నల్లటి కవర్ కప్పారు. ఇదే రోడ్డు గుండా వెళ్తున్న దుబాసి భాను వడ్ల కుప్పలను గుర్తించకపోవడంతో వాటికి ఢీకొని అదుపుతప్పి సమీపంలోని రాళ్లపై పడి మృతిచెందాడు. బాధ్యులైన వాసూరి యాదయ్య, వాసూరి తిరుపతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దుబాసి భాను అన్న ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పోచగౌడ్ తెలిపారు.

గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ



దౌలాపూర్‌లో అమ్మవార్ల ప్రతిష్ఠాపనలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 21: మండలంలోని దౌలాపూర్‌లో ఆదివారం ఎల్లమ్మ, పెద్దమ్మ, సొడలమ్మ, మహాంకాలమ్మ, మహాలింగేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన పండితుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం అమ్మవార్లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. మాజీ సర్పంచ్ యాదిలక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కొండపోచమ్మ దేవాలయ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, కృష్ణ, సాయిలు, పుల్లయ్య, జయమ్మ పాల్గొన్నారు.

మొదలైన బొడ్రాయి, దుర్గమ్మ ఉత్సవాలు

అక్కన్నపేట, ఏప్రిల్ 21: అక్కన్నపేటలో బొడ్రాయి, దుర్గమ్మ ఉత్సవాలు మొదలయ్యాయి. ఆదివారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. దుబ్బుల పూజరులు ఇంటింటికీ వెళ్లి దుర్గమ్మ ప్రతిమలు(గద్దెలు), తొట్టెలు, వస్తు సామగ్రిని నూతన దుర్గమ్మ ఆలయానికి తరలించారు. ఈనెల 24, 25, 26న బొడ్రాయి, దుర్గమ్మ దేవి విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, హోమం, పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ సాంబరాజు తెలిపారు. కులసంఘాల అధ్యక్షులు, గామస్తులు పాల్గొన్నారు.

దాచారంలో రథోత్సవం

బెజ్జంకి, ఏప్రిల్ 21: మండలంలోని దాచారంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి గ్రామంలోని పూర వీధులగుండా ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం సంతోషకరం

సిద్దిపేటలో సమ్మర్ క్రికెట్ కోచింగ్‌కు హాజరైన క్రీడాకారులు

సిద్దిపేట, ఏప్రిల్ 21: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు ప్రారంభం కావడం సంతోషకరమని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ అన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ప్రొఫెసర్ జయశంకర్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రాజు, విజయ్, కోచ్‌లు మధు, బాబు, మహేశ్, కిశోర్, అమీర్, జానీ, మజీద్, అబ్దుల్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాఘవాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చలివేంద్రం ప్రారంభం

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 21: సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆదివారం నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, రామచందర్‌రావు, కంతుల రాజు, గ్యార సురేశ్, గ్యార తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 21: భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం వీరహనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ నేత గ్యాదరి రాజారామ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మురళీ ధర్మప్రసాద్, శ్రీనివాస్, నాగేందర్,అనిల్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

గజ్వేల్, ఏప్రిల్ 21: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాజేశ్వర్‌రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్లలో కోట్లాది రూపాయలతో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకెళ్లిందని, ఓర్వలేక అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడే కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారన్నారు. కానీ, నేడు అధికారంలోకి రాగానే కేసీఆర్ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గజ్వేల్ అభివృద్ధిలో కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

గజ్వేల్, ఏప్రిల్ 21: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ సంతోష్ పాల్గొనగా, ఆలయ నిర్వాహకులు ఆయన్ని సన్మానించారు. అనంతరావుపల్లిలో రేణుకాఎల్లమ్మ, మహంకాళి అమ్మవారు, దుర్గమ్మ, పోచమ్మ, మత్తడి పోచమ్మ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

చేర్యాల, ఏప్రిల్ 21: మండలంలోని చిట్యాలకు చెందిన గీత కార్మికుడు గొట్టిపర్తి నర్సయ్య తాటి చెట్టుపై నుంచి ఆదివారం కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నర్సయ్యను బంధువులు సిద్దిపేట ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో అక్కడి నుంచి నర్సయ్యను తరలించారు. నర్సయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

మల్లన్న దర్శనం.. భక్తుల పరవశం

స్వామివారి నిత్య కల్యాణోత్సవంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చేర్యాల, ఏప్రిల్ 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మల్లన్నస్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకరించింది. స్వామివారి ఉత్సవాలు ముగిసినప్పటికీ పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 16వేల మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ తెలిపారు.శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. కార్యక్రమాలలో మల్లన్న ఆలయ ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధిశ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

ఒగ్గు పూజారులకు వార్నింగ్

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఫిర్యాదులు రావడంతో ఆలయ ఈవో తీవ్రంగా స్పందించారు. ఒగ్గు పూజారుల సంఘం ప్రతినిధులను ఆయన కార్యాలయానికి పిలిపించి పట్నం వేసి భక్తుల వద్ద డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదని, వారం డబ్బులు వసూలు చేసిన ఒగ్గు పూజారిని నెలపాటు సస్పెండ్ చేశానని తెలిపారు. భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు మరో ఫిర్యాదు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని ఆలయ ఈవో వార్నింగ్ ఇచ్చారు.

సెల్‌ఫోన్ టెండరుదారుడిపై ఆగ్రహం

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో సెల్‌ఫోన్లు భద్రపర్చేందుకు టెండరుదారుడు భక్తుల నుంచి సెల్‌ఫోన్లు లాక్కుంటున్నట్లు ఫిర్యాదు రావడంతో ఆలయ ఈవో టెండరుదారుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆలయ హోంగార్డులను పిలిచి సెల్‌ఫోన్ టెండరుదారుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు చెకింగ్ వస్తువులు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. టెండరుదారులను పిలిచి ఎందుకు మొబైల్ ఫోన్లు లాక్కుంటున్నారని మందలించడంతో పాటు ఇదే పద్ధతి కొనసాగిస్తే టెండరు రద్దు చేస్తానని తెలిపారు.

అన్నప్రసాద వితరణశాలకు విరాళం

నిత్యాన్నదాన ప్రసాద వితరణశాలకు విరాళం అందజేస్తున్న సాయిభవిక్‌రెడ్డి

కొమురవెల్లి మల్లికార్జున స్వామిక్షేత్రంలోని నిత్యాన్నదాన ప్రసాద వితరణశాలకు హైదరాబాద్ నగరంలోని యాప్రాల్‌కు చెందిన సాయిభవిక్‌రెడ్డి రూ.1,00,116 విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ ఏఈవో శ్రీనివాస్ విరాళంగా తీసుకున్న డబ్బులకు రశీదు అందజేసి, దాతను మహారాజ పోషకుల స్కీంలో నమోదు చేశారు. కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 21: మద్దూరు మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి జహంగీర్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. మండల కమిటీ సభ్యులు రమేశ్, పిట్టల నరేశ్, శ్రీకాంత్, మల్లేశం, పరశురాములు, శేఖర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హుస్నాబాద్, ఏప్రిల్ 21: హుస్నాబాద్ మెడికల్ షాప్స్(కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్) వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా రంజిత్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సలహాదారు రవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారిసన్నిధిలో అక్షరాభ్యాసం

చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న భక్తులు

వర్గల్, ఏప్రిల్ 21: వర్గల్ సరస్వతీ మాత ఆలయంలో ఆదివారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. రాష్ట్ర నలుమూలల నుంచి చదువులతల్లి అనుగ్రహం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అనంతరం తీర్థప్రసాదాలు స్వీ